క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నంద్యాలకు చేరుకున్న మహా నందీశ్వరస్వామి దంపతులు

నంద్యాల(వ్యవసాయం): దసరా నవరాత్రులను పురస్కరించుకొని మహానంది నుంచి ఆదివారం సాయంత్రం గంగా, కామేశ్వరి సహిత మహానందీశ్వర ఉత్సవ మూర్తులు నంద్యాల చేరుకున్నారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహానంది ఈఓ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కోటావీధిలోని బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయంలో జరిగే శరన్నవ రాత్రుల ఉత్సవాల్లో పాల్గొనడానికి మహానందీశ్వరస్వామి దంపతులు వస్తున్నారన్నారు. దసరా మరుసటి రోజు తిరిగి మహానందికి వెళ్తారన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

పలువురు అరెస్ట్

నంద్యాల(అర్బన్): పెద్దకొట్టాల గ్రామం ఎస్సీ కొత్త కాలనీలో ఈనెల 18వ తేదీ రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి పలువురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఈశ్వరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుల విచారణ అనంతరం సంటెన్న ఫిర్యాదు మేరకు మరో వర్గానికి చెందిన చిన్నబాబు అలియాస్ ఏసువరం, రమేష్, సుబ్బన్న, కిశోర్‌కుమార్, వెంకటేశ్వర్లు, సుంకన్న, తరుణకుమార్, సువార్తమ్మ మీద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం చెందిన దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వివేకానందరెడ్డి మాట్లాడుతూ రూ.5వేలు విలువ గల వీల్‌చైర్, దుస్తులను పీడీజీ కందుకూరు శ్రీరామమూర్తి, రోటరీ సభ్యుడు బాలకృష్ణ సహకారంతో అందివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు మోహన్‌రెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, కైలాసనాథరెడ్డి, సుబ్బరామయ్య, దస్తగిరి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): బండిఆత్మకూరు మండలం ఏపీటీఎఫ్ కార్యవర్గాన్ని ఆదివారం నంద్యాల పట్టణంలోని ఆ ఫెడరేషన్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర భాస్కర రెడ్డి, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా ఎంపీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శివలింగమయ్య, ఉపాధ్యక్షులుగా నాగార్జునరెడ్డి, చిన్నబాలునాయక్, స్వర్ణలత, పవన్‌కుమార్, కౌసర్, కార్యదర్శులుగా రాజేష్, సునిత, మాదవ్, చక్రపాణి, రాంభూపాల్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌ను ఎన్నుకోగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా లక్ష్మయ్య, నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి, వెంకటరామిరెడ్డిని ఎన్నుకున్నారు.









నంద్యాలలో విద్యుత్‌దీపాలంకరణలో అమ్మవారి చిత్రం,కాళికాంబదేవి అమ్మవారు, ఆలయ ప్రాంగణంలో వేసిన చలువ పందిరి, శరన్నవరాత్రులకు బంగారు అంగళ్ల వీధిలో ప్రత్యేక అలంకరణ

ఉత్సవాలకు వేళాయె

- నేటి నుంచి దేవీశరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం
- రోజుకో రూపంలో అమ్మవారి అలంకరణ
- ముస్తాబైన ఆలయాలు



రుద్రవరంలో ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి ఆలయం



ఆలయానికి ఎదురుగా దుర్గాదేవి రూపంలో అలంకరణ

నంద్యాల(వ్యవసాయం): దసరా అంటేనే సందడి. సంతోషం. హిందువుల ప్రధాన పండుగ ఇది. దేశ వ్యాప్తంగా ప్రజలందరూ అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారు. పది రోజుల పాటు పరమ పావనంగా జరుపుకునే పండుగ. నేటి నుంచి అమ్మవారిని రోజుకో రీతిన అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు చేస్తారు. చివరి మూడు రోజులైన దుర్గాష్టమి, మహర్ణవమి, విజయదశమి మరింత విశిష్టం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు జరుపుకునే పండుగే దసరా. ఇందులో తొమ్మిది రోజులు ప్రత్యేకంగా శివసతి అయిన పార్వతీ దేవిని విశేషమైన అలంకారాలతో, వేరు వేరు నామాలతో పూజిస్తారు. వీరికి నవ దుర్గలు అని పేరు. ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని కూడా అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుకే ఈ పేరు వచ్చింది.

- ఈనెల 21వ తేదీ అమావాస్యతో ఆశ్వీయుజ మాసం ముగిసి నిజ ఆశ్వీయుజం ప్రారంభం కావడంతో 22వ తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 2వ తేదీన విజయ దశమిని జరుపుకుంటారు. ఈ పండుగకు బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీ. ఆలయాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. పదో రోజు పార్వేట ఉత్సవం జరుగుతుంది.
- నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడేలా ఆలయాలను సర్వాంగ సందరంగా ముస్తాబు చేశారు. నంద్యాల పట్టణంలో అతిపురాతన క్షేత్రాల్లో శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానం ఒకటి. బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానం, మల్లికార్జునస్వామి దేవస్థానం, శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవాలయాలు నందుల చక్రవర్తి కాలంలో నిర్మించబడ్డాయి. ఇక్కడ దసరా శరన్నవరాత్రుల వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. అలాగే పట్టనంలోని ప్రధాన కూడళ్లలో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు మొదలవుతాయని ఆర్య వైశ్య సంఘం కమిటీ అధ్యక్షుడు చోళవేటి సూర్య నారాయణ ఆదివారం తెలిపారు. ఉత్సవాలు ముగిసే వరకు అమ్మవారి పూజా కైంకర్యాల నిర్వహణకు ఉభయ దాతలుగా ఆర్యవైశ్యులు వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో బ్రహ్మానందీశ్వర ఆలయం

నేటి నుండి ముత్యాలపాడులో దేవి శరన్నవరాత్రులు



మత్కన్యకాపరమేశ్వరిదేవి శరన్నవరాత్రుల ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలోని శ్రీమత్కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఆర్యవైశ్య సంఘం పాలక వర్గం అధ్యక్షుడు ముడియం నరసింహారావు శ్రేష్టి మాట్లాడుతూ పది రోజుల పాటు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి పూజలు చేయనున్నట్లు వెల్లడించారు. అమ్మవారి ఊరేగింపు కోసం దాతలు టేకు రథాన్ని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు రామక్రిష్ణ, ఎం.సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలక్రిష్ణ ఉప కార్యదర్శి వెంకట రమేష్, కోశాధికారి మధవ నరసింహయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా స్కేటింగ్ పోటీలు



స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో రాష్ట్రస్థాయి స్కేటింగ్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. క్రీడా భారతి ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మకాయల సుధాకర్, ఫిరోజ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నంద్యాలలో మొదటి సారి స్కేటింగ్ పోటీలు జరుగుతున్నట్లు చెప్పారు. ఇందులో నాలుగేళ్ల నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా భారతి సభ్యులతో పాటు రామకృష్ణ విద్యాసంస్థల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక తిలతర్పణ కార్యక్రమం

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మహాలయ అమావాస్య పురస్కరించుకొని అపరఖర్మల శివాలయంలో సామూహిక తిలతర్పణ కార్యక్రమం నిర్వహించారు.సంఘం రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్, నాయకులు మురళీకృష్ణ, రాజశేఖర్, ఎన్‌వీఎస్ శుక్లా, మల్లాది ఆదినారాయణ, కృష్ణమోహన్ శర్మ, శారదావాని, ప్రశాంతి, స్వర్ణలత, పావని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు నంద్యాల క్రీడాకారుడు సుమిత్ ఎంపికైనట్లు ఐఎంఏ మాజీ అధ్యక్షుడు రవికృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆ క్రీడాకారుడిని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ సభ్యులు రమణయ్య, లాలుస్వామి, రామయ్య, కరాటే మాస్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె



చాగలమర్రి: మండలంలోని రాంపల్లె గ్రామంలో దూదేకుల దస్తగిరి అనే వ్యక్తికి చెందిన మట్టి మిద్దె ఆదివారం తెల్లవారు జామున కూలిపోయింది.

అయితే, ఆ సమయంలో దస్తగిరి కుటుంబసభ్యులు ఇంట్లో నుంచి బయటకు రావడంతో ప్రాణ నష్టం తప్పింది. గత పదిరోజులుగా మండలంలో కురుస్తున్న వానలకు మట్టిమిద్దెలు తడిసి దెబ్బతిన్నాయి. ఈ క్రమంలోనే కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ఆగస్టు నెలలో చిన్న వంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు మట్టిమిద్దెల్లో నివసించే వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

వాసవీ పీఠాధిపతికి ఘన స్వాగతం

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్య కుల గురువు కర్ణాటక, వారనాశి ఆశ్రమాల పీఠాధిపతి శ్రీ వామనాశ్రమ మహాస్వామీజీకి నంద్యాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. స్థానిక సాయిబాబా గుడి వద్ద నుంచి కల్పనాసెంటర్, చిన్నాసుపత్రి, అమ్మవారి శాల మీదుగా కొనసాగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు మాట్లాడుతూ స్వామి వారు 12 రోజుల పాటు అమ్మవారి శాలలో ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారి ప్రాశస్త్యంపై ఉపన్యాసాలు చేస్తారని తెలిపారు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బొమ్మలసత్రం: పట్టణంలోని చామకాలువకు వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో కాలువ వెంట ఉన్న కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. ఆదివారం ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చామకాలువకు నీటి ప్రవాహం పెరిగిందన్నారు. ఈక్రమంలో కాలువ అనుకొని ఉన్న విశ్వనగర్, పక్కీర్‌పేట, శ్యామ్‌నగర్, దేవనగర్, వెంకటాచలం కాలనీ, సలీమ్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్క డ నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలాలని సూచించారు. దేవనగర్‌లోని కరుణామయ స్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు.

పది గంటల పనిదినాన్ని వెనక్కి తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పది గంటల పనిదినాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని భారత కార్మిక సంఘాల(ఎఫ్ఐటీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.

ప్రజా ప్రతినిధులంటే లెక్కలేదా?

- ఎన్నిమార్లు చెప్పినా సమస్యలు పట్టించుకోరు
- మండల మీట్‌లో అధికారులపై స్థానిక ప్రజా ప్రతినిధులు ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు పేరయ్య



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఉయ్యాలవాడ: 'ప్రజా ప్రతినిధులంటే అధికారులకు లెక్కలేదు. ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నా'రని అధికారుల పనితీరుపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అజెండాలో పొందుపరిచిన అంశాల్లో భాగంగా హౌసింగ్, విద్యుత్, అంగన్‌వాడీ, విద్య, వైద్యం, వ్యవసాయశాఖ, తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. హరివరం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పెద్ద పేరయ్య మాట్లాడుతూ గృహ నిర్మాణం మంజూరుకు హౌసింగ్‌లో నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేశాను. నా భార్య నాగసుబ్బమ్మ ఆధార్ కార్డు రుద్రవరం మండలంలో వేరే వారు హౌసింగ్ తీసుకున్నారని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ సమస్య పరిష్కారం కాలేదు. ప్రజాప్రతినిధి పరిస్థితే ఇలా ఉంటే ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేద'ని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరు గ్రామ సర్పంచ్ మాదర క్రిష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సమయ పాలన పాటించడం లేదన్నారు. మండల కేంద్రం ఉయ్యాలవాడలో ఎస్సీ, బీసీ కాలనీలలో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. పంచాయతీ శాఖ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు, చిన్నారులకు ఏదైనా ప్రాణనష్టం జరిగితే ఆయా గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించవలసి వస్తుందని ఎంపీపీ హెచ్చరించారు.

భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి–ఎంపీపీ

ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ సూచించారు. గ్రామాల్లో సమస్యలను అధికారులు తమ దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తాగు నీరు, మురికి కాలువల నిర్వహణ, పారిశుద్ధ్యం, తదితర మౌళిక సదుపాయాల కల్పనకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రఘురామిరెడ్డి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, ఫణీత్‌క్రిష్ణ, వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, అల్లూరు పశు వైద్యాధికారి సాయిబాబా, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు గగ్గెర వెంకటేశ్వర్లు, దేవి, కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, సర్పంచ్‌లు మేకల ఓబులేస్, రామమద్దిలేటిరెడ్డి పాల్గొన్నారు.

ఉప్పొంగి..ముంచెత్తి!

- జిల్లాలో భారీ వర్షాలు
- పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- పలు గ్రామాలు జలదిగ్బంధం
- దెబ్బతిన్న పంటపొలాలు



నంద్యాల పట్టణంలో ఇళ్లను ఆనుకొని ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పాలేరువాగు



బీరవోలు వద్ద నీటి పారకంతో కొట్టుకు పోయిన వరి పైరు

నంద్యాల(అర్బన్)/రుద్రవరం: జిల్లాలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో వంకలు, వాగులు ఉప్పొంగాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నల్లమల కొండల్లో కురిసిన భారీ వర్షాలతో వరద ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. పాలేరు వాగు పొంగడంతో మహానంది, గాజులపల్లె గ్రామాలు జలమయమయ్యాయి. అరటి తోటలు, పంట పొలాల్లో భారీగా వరదనీరు వచ్చి చేరడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అయ్యింది. ఆత్మకూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో కురిసిన వర్షాలతో రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి.

నంద్యాలను చుట్టుముట్టిన వరదనీరు

నల్లమల అడవుల్లో కురిసిన వర్షాలతో కుందూనదితో పాటు మద్దిలేరు, పాలేరు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మహానంది, గాజులపల్లె సమీప ప్రాంతాల నుంచి వస్తున్న పాలేరువాగు నీటితో నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్, విశ్వనగర్, శ్యాంనగర్, హనీఫ్‌నగర్, సలీంనగర్, సరస్వతి నగర్ తదితర ప్రాంతాలను వరద నీరు చుట్టుముట్టింది. ఇళ్లలోకి నీరు వచ్చి చేరడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నంద్యాలలో భారీ వర్షం కురవకపోయినా పై ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో నంద్యాల పట్టణం జలమయమైంది. లోతట్టు కాలనీ ప్రజలకు పైప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. అదే విధంగా మద్దిలేరువాగు పొంగి ప్రవహించడంతో బయటిపేట, హరిజనవాడ, అరుంధతినగర్, పీవీనగర్ తదితర ప్రాంతాల్లో వరదనీరు వచ్చి చేరింది.

ముంపు ప్రాంతాల పరిశీలన

వరద ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, తహసీల్దార్, శ్రీనివాసులు సందర్శించి ప్రజలకు భరోసా ఇచ్చారు. వరద ఉద్ధృతి ఉన్న ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు రావాలంటూ అధికారులు పిలుపునిచ్చారు.

పంటలకు తీవ్ర నష్టం

రుద్రవరం మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో స్థానికంగా ఉన్న వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 4 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. రుద్రవరం–శిరివెళ్ల,పేరూరు–ఎర్రగుంట్ల, చిలుకలూరు–బత్తలూరు గ్రామాల మధ్య ఉన్న వకిలేరు వాగుల్లో నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. అలాగే వాగుల్లో నుంచి నీరు పొలపగా పంట పొలాల్లోని పైర్లపై పారింది. దీంతో తిప్పారెడ్డిపల్లె, ఎల్లావత్తుల, బీరవోలు తదితర గ్రామాల్లో వరి పైర్లు కొట్టుకు పోయాయి. ఎల్లావత్తుల, తిప్పారెడ్డిపల్లె, ముకుందాపురం, సర్పాపురం తదితర గ్రామాల పరిధిలో మొక్కజొన్న పంట పూర్తిగా నేలవా లింది.వర్షాలు అధికం కావడంతో పాత మట్టి మిద్దెలు నేల కూలుతున్నాయి. ఇందులో భాగంగానే ఎల్లావత్తులలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గోడ కూలింది.





ఎల్లావత్తుల వద్ద నేలవాలిన మొక్కజొన్న, ఎల్లావత్తులలో కూలిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గోడ





బైటిపేటలో వరద ఉద్ధృతిని పరిశీలిస్తున్న కమిషనర్, తహసీల్దార్లు, ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మద్దలేరు

సమాజానికి వెలుగుజాడ.. గురజాడ



గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఆధునిక తెలుగు సాహిత్యానికి, సమాజానికి వెలుగుజాడ చూపిన మహాకవి గురజాడ అప్పారావు అని సాహితీ స్రవంతి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, నీలం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి అన్నారు. గురజాడ అప్పారావు 163వ జయంతిని ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. సాహితీ వేత్తలు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో కవులు నరేంద్ర, నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, మాబుబాషా గురజాడ జీవితంపై కవితలు వినిపించారు. కార్యక్రమంలో సాహితీ సభ్యులు కృష్ణయ్య, డాక్టర్ కిశోర్, సుబ్బయ్య, శ్రీధర్, రఫి, ఈశ్వర్ రెడ్డి, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నంద్యాల, ఆళ్ళగడ్డ
99122 20581 (నంద్యాల)
70750 09103 (ఆళ్ళగడ్డ)
Office mail : sakshiknladvt@gmail.com